

ఘనం.. గణపతి హోమం

సంకష్ట హర చతుర్థి సందర్భంగా మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఈఓ. లావణ్య ఆధ్వర్యంలో సామూహిక గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోశ్చరణల నడుమ గణపతికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చంద్రకాంత్ శర్మ, సంతోష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు. ఆలయ నూతన పాలకమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులను డిసెంబర్ 8 లోపు ఎండోమెంట్ కార్యాలయంలో అందజేయాలని ఈఓ. లావణ్య స్పష్టం చేశారు. –చంపాపేట

కమనీయం.. కల్యాణోత్సవం

ఆర్‌కేపురం ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్, సరూర్‌నగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రామకృష్ణపురం పార్కులో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా శ్రీ అశ్వత్థ లక్ష్మినారాయణ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ శ్రీనివాస్ గురుమూర్తి ఆధ్వర్యంలో గోపూజ, ఉసిరి వృక్షపూజ, రావి–వేప చెట్లను శ్రీ విష్ణుమూర్తి, లక్ష్మిఅమ్మవారి స్వరూపంగా భావిస్తూ కల్యాణం నిర్వహించారు. ఆర్‌కేపురంలో సనాతన ధర్మ కార్యక్రమాలను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని సొసైటీ ప్రధాన కార్యదర్శి రామారావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. –దిల్‌సుఖ్‌నగర్





వైభవం.. బ్రహ్మోత్సవం

నాగోల్‌లోని ఈదమ్మ మాత తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో కృష్ణ, శంకర్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, మధు, కార్తిక్, విజయ్, సంజీవ్, విఘ్నేష్ పాల్గొన్నారు. –నాగోలు

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



డీసీ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: మున్సిపల్ కార్మికులందరిని పర్మనెంట్ చేసే వరకు పోరాడుతామని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ జోన్ మున్సిపల్ సంఘం అధ్యక్షులు జే.యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎం .మదిలేటి ఆధ్వర్యంలో మంగళవారం హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేసే వరకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులు వారంలో ఒకరోజు అత్యవసరం ఉన్నప్పుడు విధులకు రాకపోతే రెండు రోజుల వేతనాలు కట్ చేస్తున్నారన్నారు. 60 ఏళ్లు దాటిన కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగితే వేతనాలు కట్టివ్వాలని పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో రమావత్ సక్రునాయక్, బోయపల్లి రాములు గౌడ్, కరుణాచారి, రవి, కృష్ణవేణి, కనకమ్మ, పద్మ, సావిత్రి, లక్ష్మి, శ్రీరాములు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆయన పంజేషా క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

లింగోజిగూడ: హయత్‌నగర్ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించిన హోమియో ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నర్సయ్య, వైద్యురాలు అన్నపూర్ణ, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం



నాగోలు: పిల్లలలో అపరిమితమైన సృజనాత్మకతను వెలికితీయడమే ఐటీసీ సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ లక్ష్యమని ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ ఫుడ్స్ డివిజన్ సీఓ అలీ హారిస్ అన్నారు. హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ యొక్క ఐకానిక్ ఫాంటసీ స్పేస్‌షిప్ బిగ్ ఫాంటసీస్ గివ్వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ కార్యక్రమాన్ని నాగోలులో నిర్వహించారు. కళ, విజ్ఞాన శాస్త్రం, అపరిమితమైన సృజనాత్మకతను రేకెత్తించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. బిగ్ ఫాంటసీస్‌తో భారతదేశంలో చక్రాలపై మునుపెన్నడు చూడని సాంకేతికతను తాము తీసుకురావడానికి గర్వపడుతున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో నగరంలోని చాలా మంది పిల్లలకు ఈ అనుభవాన్ని అందించాలని కోరుకుంటున్నామని వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం లారీలు

నాగోలు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం . సరూర్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఫైజ్, గోల్కొండలోని ఓవైసీ గ్రౌండ్ నివాసముంటున్నాడు. ఎల్‌బీ నగర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, టీకేఆర్ కమాన్, చైతన్యపురి తదితర ప్రాంతాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి సరూర్‌నగర్‌లోని శ్రీనివాస నగర్ కాలనీలో రెండు గదుల్లో నిల్వ చేసి రాత్రి సమయంలో లారీల ద్వారా జహీరాబాద్ టౌన్‌కు తరలించి అక్కడ విక్రయిస్తున్నాడు. మహారాష్ట్ర, నాందేడ్‌టౌన్‌కు చెందిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ సూర్య వంశీ జీవన్, బాలాపూర్, కొత్తపేటకు చెందిన డ్రైవర్ సర్వర్ అహ్మద్ ఖాన్‌తో కలిసి బియ్యాన్ని తరలిస్తాడు. సోమవారం అర్ధరాత్రి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణనగర్ కాలనీలో చిన్న లారీల నుంచి పెద్ద లారీల్లోకి బియ్యం తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీలతో పాటు 200 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: కమలానగర్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో పర్యటించి కాలనీ సమస్యలపై ఆరా తీశారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట వెంకన్న, సుబ్బారావు, కాలనీ వాసులు ఉన్నారు.

మహిళపై దాడిచేసి.. చోరీకి యత్నించిన ఇద్దరి రిమాండ్

చైతన్యపురి: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి బంగారు వస్తువుల అపహరణకు యత్నించి పట్టుబడిన ఒకరు, అతడికి సహకరించిన మరొకరిని రిమాండ్‌కు తరలించిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ గురుస్వామి వివరాల ప్రకారం.. ఆర్‌కేపురం రోడ్డు నంబర్–5లో నివసించే వెంకటరమణి (54), సోమవారం రాత్రి 9.30 ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో స్నేహపురి కాలనీకి చెందిన మోముల సంగమేష్ (22), చొరబడి లోపలి నుంచి గడియ పెట్టి ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా కొట్టి ఆమె మెడలోని పుస్తెల తాడు చంద్రహారం లాక్కుంటుండగా ప్రతిఘటించిన వెంకటరమణి గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానంతో సంగమేష్‌తో పాటు అతడికి సహకరించిన కామారెడ్డికి చెందిన విస్లావత్ వంశీ (16)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

శంకర్‌నగర్, విద్యానగర్, శంకర్‌నగర్ ఓల్డ్, కిసాన్ దొడ్డి, సరోజీనగర్, ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్ కాలేజ్, ఇండస్‌ల్యాండ్ బ్యాంక్, వాణిజ్యవిహార్, నలందా కాలేజ్, బిగ్ సి, తిరుమల హిల్స్, రెవిన్యూబోర్డ్ కాలనీ, నారాయణ కాలేజ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

అగ్రికల్చర్ ఆఫీస్, ఒవైసీ గ్రౌండ్, అంబేద్కర్ నగర్, హ్యాపీ హోమ్స్, క్యాపిటల్ హోటల్, ఆస్మాన్‌ఘడ్ సేఫ్ హాస్పిటల్, బీకే ఫంక్షన్‌హాల్ బ్యాక్‌సైడ్, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, భూలక్ష్మీ నగర్, తిరుమలహిల్స్, గడ్డిఅన్నారం, కల్యాణ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

24న ప్రథమ వార్షికోత్సవం

నాగోలు: తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం (సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, ఐటీబీపీ, ఎస్‌ఎస్‌బీ అస్సాం రైఫిల్స్) ప్రథమ వార్షికోత్సవం ఈనెల 24 న బాగ్ లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ సుందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారుడు వెం నరేందర్ రెడ్డి పాల్గొంటరని రాష్ట్రంలో నివసిస్తున్న మాజీ పారా మిలటరీ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.31, వంకాయ రూ.45, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.31, క్యారెట్ రూ.55, దొండ రూ.31, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.40, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.35, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.37, మునగ రూ.155, కీర రూ.18, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.70. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

జాతీయస్థాయి పోటీల్లో అర్హత సాధించడం అభినందనీయం

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. నాగోలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నించి ప్రోకబడ్డీ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందని వారిని తీర్చిదిద్దడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీల కృషి అమోఘమన్నారు. అద్భుత ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున సహాయ సహకారాలు అందేలా చూస్తానన్నారు.

నీటి లీకేజీతో విద్యార్థులకు ఇబ్బంది

మలక్‌పేట: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన విద్యార్థులు సమస్యలతో కుస్తీ పడుతున్నారు. సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారుల విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూసారాంబాగ్ కట్టెలమండి బాలుర హాస్టల్‌లోని వాష్ రూమ్ నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో రాత్రి పడుకోవడానికి ఇబ్బందిగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నీటి లీకేజీతో కనీసం కూర్చుని చదువుకునేందుకు వీలులేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థి నేత అనిల్‌కుమార్ డిమాండ్ చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రెడ్డిబస్తీలో పర్యటిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రెడ్డిబస్తీ వాసుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానికులతో మాట్లాడారు. కుప్పలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను చూసి సంబంధిత సిబ్బందితో తరలింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ఇళ్లలో పోగయ్యే తడి,పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. ఇష్టానుసారంగా ఖాళీ ప్రాంతాలు, రోడ్డు పక్కన చెత్తవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ వెంట శ్రీనివాస్, యోగిరాజ్, మల్లికార్జున్, ప్రతాప్‌రెడ్డి, వినోద్‌కుమార్, సతీష్, తిరుపతి ఉన్నారు.

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎల్‌బీనగర్: ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన తెలంగాణ మెడికల్, హెల్త్ విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, పేషెంట్ కేర్ సెక్యూరిటీగార్డు ఉద్యోగ కార్మికుల యూనియన్ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల 1న జీతాలు అందజేయాలని, కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ఐ కట్టని ఏజెన్సీలను రద్దు చేయాలని కోరారు. మహిళ ఉద్యోగులకు జీతంతో కూడిన 6 నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు యాదవ్, భిక్షపతి, సుభాష్, రఫియుద్దీన్, శాంతకుమారి పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా



పనులను పరిశీలిస్తున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తవుతాయన్నారు. చాలా ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

ఇందిరాగాంధీకి నివాళి

చైతన్యపురి: భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. చైతన్యపురిలో జరిగిన కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. భారత దేశ కీర్తిని నలుమూలలకు చాటిచెప్పిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ అని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నవీన్‌చారి, సతీష్‌గౌడ్, అశోక్‌గౌడ్, ప్రభాకర్, నాగార్జునరెడ్డి, రాంబాబు, కిరణ్, జానిబాయ్, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీనివాస్ రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జలమండలి 11వ డివిజన్ల పరిధిలోని నీటి బకాయిదారులు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని జీఎం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని బకాయిలపై ఉన్న వడ్డీ మాఫీ అవుతుందని అసలు మాత్రమే చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు 19,990 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని తద్వారా రూ.1.10 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని అలవర్చాలి



బహుమతులు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని అలవర్చాలని నారాయణ పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఆయన హాజరయ్యారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం హేమాంబర్, రవిప్రసాద్, శివరంజని, మహేశ్వరి, మీనా, ప్రిన్సిపాల్ నీరజ, సమన్వయ కర్తలు శరత్ బాబు, గాయత్రి, శిరీష, రమేష్, స్వర్ణలత, శ్రావణి పాల్గొన్నారు.

మలక్‌పేట గంజ్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేకువజామున ఎస్‌ఎఫ్ గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. గోదాంలో దాదాపు రూ.18 లక్షల విలువ చేసే పేపర్ గ్లాసులు దగ్ధమైనట్లు యజమాని రాజేష్ అగర్వాల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గోదాం పక్కన చెత్త ఉండటంతో నిప్పురవ్వలు పడి అగ్నిప్రమాదానికి కారణమైందని ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అంజిరెడ్డి తెలిపారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణయ్య

చైతన్యపురి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీనగర్ ఏసీపీ అమరగాని కృష్ణయ్య అన్నారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ లా కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఏసీపీ పాల్గొని మాట్లాడారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన డిజిటల్ అరెస్టులు, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల గురించి వివరించారు. ర్యాగింగ్ మహమ్మారిని నివారించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, సైబర్ వారియర్స్, కళాశాల ప్రిన్సిపల్ మానస, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: భోజన ప్రియులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేసి వారి మన్ననలు పొందాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.కర్మన్‌ఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చిరాగ్ హోటల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాపారాల పట్ల యువత ఆసక్తి చూపిస్తున్నారని, వినియోగదారులకు మంచి సేవలు అందిస్తే ఎలాంటి వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, బేర బాలకిషన్, దయానంద్, ఆనంద్‌గౌడ్, బాలగౌడ్, నిర్వాహకులు సందీప్ యాదవ్, అనిల్‌గౌడ్, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



నాగోలు: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్ ట్రైనింగ్ పార్క్‌ను మంగళవారం మన్సూరాబాద్ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సందర్శించగా రోడ్డు భద్రత గురించి వివరించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన చిన్నసైకిల్, హెల్మెంట్ అందజేసి ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. చిన్నాబ్యాటరీ కారు ఏర్పాటు చేసి కారులో ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కవితారెడ్డి, సేఫ్టీ ట్రైనర్ ప్రవీణ్, సేఫ్టీ మేనేజర్ సాదిక్ సాగర్, ఎస్‌ఐ మనోహర్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పరిశీలన



మలక్‌పేట: డిప్యూటీ సీఎం కార్యాలయం, ఎజెండా ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఆరోగ్య పరిశోధన క్లస్టర్ అధిపతి నావికా హర్షే, జీహెచ్‌ఎంసీ సౌత్‌జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి మలక్‌పేటలో కొనసాగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. మూసారంబాగ్ డివిజన్ ఇందిరానగర్‌లో ఇంటి యజమానులను కలిసి సర్వే ఆవశ్యకత, ప్రయోజనాల గురించి వివరించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఎంసీ ఠాకూర్ సంజయ్‌సింగ్, సూపర్‌వైజర్ నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాజు

చైతన్యపురి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన రాజు (29) చైతన్యపురిలోని ఓ టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. గత గురువారం ఇంటి నుంచి టీస్టాల్‌కు వెళ్లిన రాజు తిరిగి రాకపోవడంతో యజమానికి ఫోన్ చేయగా తలనొప్పిగా ఉందని వెళ్లాడని తెలిపాడు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.